# నిలువాటి ఎండనీడ

ఆ వేళ సెలవు రోజయినా ఆఫీసుకు బయల్దేరబోతోంటే, "ఇవేళ వెళ్లక పోతేనేం?" అడిగింది. అనసూయ. ఆదివారాలు సెలవు రోజుల్లో నేను ఆఫీసుకు వెళ్ళడం నా భార్యకు ఇష్టం లేదు. పిల్లలకూ్కాడా ఇష్టం లేదు. మామూలు రోజుల్లో ఆఫీసు పనులకు ఏవో అంతరాయాలు కలుగుతూ ఉంటాయి. ముందుకు కదలవు. సెలవు రోజుల్లో అయితే ఎటువంటి అంతరాయం ఉండదు. ఒకవేళ వెళ్ళినా సాయంత్రం నాలుగింటి ముందే తిరిగి వచ్చేసి అనసూయను, పిల్లలను బయటికు తీసుకువెళ్తాంటాను.

"త్వరగా వచ్చేస్తాను." అన్నాను.

"కక్కాయ్ వాళ్ళింటికి వెళ్దామనుకున్నాం కదా?" అంది.

వాళ్లింట్లోని కార్యక్రమం సంగతి మర్చిపోయాను. ఆ మధ్యాహ్నం భోజనానికి రమ్మని మరీ మరీ చెప్పి వెళ్ళారు. ఆయన మాకెంతో సహాయం చేశారు.

"ఇంటికొచ్చి పిలిచాక వెళ్ళకపోతే బావుంటుందా?" అంది.

అనసూయ వాళ్ల కక్కాయ్ అంటే నాకెంతో గౌరవం. నెలకిందట వాళ్ల అబ్బాయి గృహప్రవేశానికి వచ్చి పిలిచినా ఆఫీసులో ఇనస్పెక్షన్ ఉండడం వలన నాకు వీలు కాలేదు. నేను పక్కన లేకపోతే అనసూయ సామాన్యంగా ఏ కార్యక్రమానికి వెళ్లదు.

"ఒక పని చేయండి. మధ్యాహ్నం నువ్వూ పిల్లలూ వెళ్లండి. ఒకటీ ఒకటిన్నర మధ్యలో నేను ఆఫీసు నుండి సరాసరి మీ కక్కాయ్ వాళ్ళింటికి వస్తాను. అక్కడ ఫంక్షనయ్యాక అందరం కలిసి ఏ సినిమాకయినా వెళ్దాం" అన్నాను.

అనసూయ, నా ముఖం లోకి అపనమ్మకంగా చూసి, తల అడ్డంగా ఆడించి, "నువ్వు రావు. రానందుకు ఏదో కారణం చెబుతావు" అంది.

ఆమె అన్న మాట నిజమే. లోగడ నాలుగయిదు సార్లు అలా చెప్పి వెళ్లలేకపోయాను. అందుకు కారణం ఉంది. ఆమె తరుపువాళ్ళు బాగా చదువుకుని

బి.పి.కరుణాకర్

మంచి ఉద్యోగాల్లో  ఉన్నారు. నా చదువు డిగ్రీతో ఆగిపోయింది. అక్కడి వరకు అమ్మ ఎంతో కష్టపడి చదివించింది. నేను చేసేది సామాన్యమయిన ఉద్యోగం. ఆమె వాళ్ల ఇళ్ళకు వెళ్ళినప్పుడు అనసూయ మీదున్న అభిమానంతో నన్ను బాగానే చూసుకుంటారు. కలుపుగోలుగా మాట్లాడతారు. నాకే లోపం చేయరు. నేనే తప్పు చేసిన వాడిలా ముడుచుకుపోతుంటాను. అనసూయకు ఈ విషయం నేనెప్పుడూ చెప్పలేదు. తనుమటుకు వాళ్లతో ఫ్రీగా కలిసిపోతుంది.

“నన్ను నమ్ము. తప్పకుండా వస్తాను.” అన్నాను.

నేను అంతే అన్నాను. అంతకు మించి మరోమాట అనలేదు. ఉదయం నుండి ఆమె మనసు చికాకుగా ఉందో, ఏమో, అప్పటి వరకు నాతో మంచిగా మాట్లాడుతున్నదల్లా, “మీ వాళ్ళింట్లో ఏ ఫంక్షనుకయినా పరుగెత్తుకుంటూ వెళ్తావే? మావాళ్ళ దగ్గర కొచ్చేసరికి ఏమవుతుంది?” అరుస్తున్నట్టుగా అంది.

మా తరుపు వాళ్లలో పెద్దగా చదువుకుని మంచి ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు ఎవరూ లేరు. డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నది నేనే. అంచాతనేమో మా వాళ్ళతో ఫ్రీగా మెలుగుతుంటాను. అనసూయ మాటకు ఏమని జవాబు ఇవ్వాలో అర్థం కాలేదు.

మా పెళ్లయి తొమ్మిది సంవత్సరాలు నిండాయి. ఇద్దరు పిల్లలు. పెద్దపాపకు ఏడు, రెండో పాపకు అయిదు సంవత్సరాలు. అనసూయ ప్రేమగల వ్యక్తే. ఇద్దరం ఏ పొరపొచ్చలు లేకుండా అన్యోన్యంగా ఉంటుంటాం. ఆమె కూడా డిగ్రీ పూర్తిచేసింది. తనకు తగిన వాడిని కానేమోనని చాలా సార్లు అనిపించింది. ఇంటి పనుల్లో నేనామెకు సహాయంగా ఉంటాను. వీలయినంత వరకు తనకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటుంటాను. ఈ మధ్యనే ప్రావిడెంట్ ఫండ్ లోంచి లోను తీసి ఆమెకు రెండు జతల బంగారపు గాజులు, పిల్లల చెవులకు లోలాకులు చేయించాను. మాటా మాటా ఎప్పుడూ అనుకోమని కాదు, అనుకున్నా అయిదారు నిమిషాల్లో సమసిపోతుంది.

ఎంచాతనో ఆ వేళ  మా మాటలు పెద్దవయి కోపాలు దాటి అరుపులతో ముందుకు వేగంగా వెళ్ళిపోయాయి. నేనయినా తగ్గి ఆగి ఉండవలసింది. నేనేమంత రెచ్చిపోవలసిన విషయమూ కాదు. విచక్షణ మరిచి ఎప్పుడూ లేనిది లాగి ఆమె చెంపమీద కొట్టాను. పెళ్లయిన తర్వాత ఆమె మీద చేయి చేసుకోవడం అదే మొదటి

సారి. ఆ సంఘటన తనూ ఊహించి ఉండదు. ముందు బిత్తరపోయింది. తర్వాత దుఃఖం ఆపుకోలేక పోయింది. పడక గదిలోకి వెళ్లి పెద్దగా ఏడవడం మొదలెట్టేసరికి పిల్లలిద్దరూ ఆమెను పట్టుకుని ఏడవసాగారు. నా ప్రవర్తనకు నా మీద నాకే అసహ్యం వేసింది. ఏం చేయాలో తెలియడం లేదు.

అయిదు నిమిషాల పాటు పడకగది తలుపుకు అనుకుని నిలబడి నెమ్మదిగా అనసూయ దగ్గరకు వెళ్ళి పక్కనే కూర్చుని "సారీ అనూ... ప్లీజ్... నన్ను క్షమించు..." అన్నాను. ఆమె నా వంక అసహ్యంగా చూసి ఏడుపు స్థాయి పెంచింది. ఆమెతో పాటు పిల్లలూ స్వరాలు పెంచారు. ఆమె తలమీద చేయిపెట్టి నిమరబోతోంటే విసిరికొట్టింది. "పొరపాటు నాదే అన్నాను కదా, ఇహముందు అలా ఎప్పుడూ చేయను... ప్లీజ్... క్షమించమంటున్నాను కదా..." పిల్లల ముందు అంతలా బతిమాలడడం ఇబ్బందిగానే అనిపిస్తోంది. ఆమె చేతులు పట్టుకుందామని ప్రయత్నం చేస్తొంటే వీలు కానీయడం లేదు. తన చేతులు నాకు అందకుండా కిందపెట్టుకుని బోర్లా పడుకుంది. ఏడుపు ఆపడంలేదు.

ఇంకొద్దిగా బతిమలాడితే కరిగిపోతుంది. మేమిద్దరమే ఉండి ఉంటే దగ్గరకు తీసుకుంటే మామూలు అయిపోయేది. మా పిల్లలు గురించే నేను భయపడ్డాను. ఒకళ్ళను మించి మరొకళ్ళు సిసింద్రీలు. 'మా అమ్మ ఏడుస్తోంటే మా నాన్న కాళ్లా వేళ్లా పడ్డాడ'ని చుట్టు పక్కల వాళ్ళందరికీ చెప్పేస్తారు.

అలాగే మంచం మీద కూర్చున్నాను. నాకూ బాధగా ఉంది. ఆమెను ఓదార్చడానికి నాకు అవకాశం ఇవ్వడం లేదు. అనసూయ చటుక్కున లేచి కూర్చుని ఈ మధ్యనే కొనిచ్చిన బంగారపు గాజులు తీసింది. ఫంక్షనుకు వెళ్దామని బీరువాలోంచి వాటిని తీసి తొడుక్కున్నట్టుంది. నా ముఖంలోకి చూడలేదు. గాజులు గది మూలకు విసిరి మళ్ళీ పడుకుంది. ఈసారి కూడా తన చేతులు అందిపుచ్చుకునే అవకాశం ఇవ్వలేదు. ఏడుపూ ఆపలేదు. స్వరం మటుకు తగ్గింది. ఆమె గాజులు విసిరేస్తోంటే నా మనసు చివుక్కుమంది. ఆమెనేం అనదల్చుకోలేదు. మంచం మీంచి లేచి గాజులు తీద్దామనుకునేంతలో పిల్లలు ఏడుపు ఆపి మంచం దిగి పరుగెత్తుకుంటూ వెళ్ళి చెరో రెండు గాజులు అందుకుని తొడుక్కున్నారు. అవి వాళ్ల చేతులకు పెద్దగా ఉన్నాయి.

"అమ్మకిచ్చేయండమ్మా" అన్నాను.

వాళ్ళు అమ్మకయితే భయపడతారు కాని నా మాటలు అట్టే పట్టించుకోరు. లేచి నుంచున్నాను. గాజులు ఎక్కడ పోగొడతారో అనిపిస్తోంది. వాళ్ల ముఖాల్లో నా మీద కోపం తగ్గిపోలేదు. అప్పటికే కొద్దిగా విసిగిపోయి ఉండడం వలన, “ఇచ్చేయమన్నానా?” అరిచాను.

దాంతో మళ్ళీ ఏడవడం మొదలెట్టారు. నేను అనుకున్నంత అయింది. వాళ్ల చేతుల్లోంచి నేనెక్కడ గాజులు లాక్కుంటానేమోనని అనుకుని ఉండాలి. గాజులు తీసి కిటికీలోంచి బయటకు విసిరేశారు. విపరీతమయిన కోపం వచ్చింది. నిగ్రహించుకున్నాను. వాళ్లనేం అనదల్చుకోలేదు. ఇద్దరూ వచ్చి అనసూయ పక్కన చేరారు. అటు పక్క మరో ఇల్లులేదు. వీధిలో చివరి ఇల్లు మాదే. మా ఇంటికి అవతల ముళ్ల పొదలు, చిన్న చెట్లు తప్ప ఏమీ లేవు. వాటిల్లో ఎక్కడ పడిపోయి ఉంటాయో?

“నీ గాజులు పిల్లలు కిటికీలోంచి బయటకు విసిరేశారు.” అన్నాను.

అనసూయ ఏడుపు ఆపి, లేచి కూర్చుంది. జుట్టు ముడి వేసుకుంటూ, “పోతే పోనీ” తనలో తను అనుకుంటున్నట్టుగా అంది.

“కావాలి అనుకుంటే వెళ్ళి వెతికి తెచ్చుకో” అని ఇంటి బయటకు వచ్చాను.

నా మీద నాకే కోపంగా ఉన్నప్పుడు కొద్ది దూరం నడిచానంటే తగ్గిపోతుంది. కాలనీ చివరి వరకు వచ్చి గురవయ్య టీ కొట్టులో కూర్చుని టీ తాగి సిగరెట్ వెలిగించాను. ఆ గాజులు పోతే మళ్ళీ కొనే పరిస్థితుల్లో లేను. అనసూయ ఇంటి బయటకు వచ్చి వెదకడం మొదలెట్టిందో లేదో? మా ఇంటి పక్కనే కాలిబాట ఉంది. పాత కాయితాలు, సీసాలు, డబ్బాలు తీసుకుని వెళ్ళే వాళ్ళు తప్ప ఎవరూ ఆ పక్కకు రారు. పొరపాటున ఎవరయినా అటు పక్కకు వచ్చి ఉండి, గాజులు వాళ్ళ కళ్లలో పడ్డాయంటే గాజులు దొరికే అవకాశం లేదు. చేతుల్లోంచి జారిపోయినట్టే అనుకోవాలి. ఇదంతా నా తొందరపాటు వల్లనే జరిగింది.

మరో రెండు టీలు, అరపెట్టె సిగరెట్లు తాగాక నా మనసు కుదుట పడింది. డబ్బులిచ్చి టీ కొట్టులోంచి బయటపడి ఇంటి ముఖం పట్టాను.

ఇంటికి చేరుకునే సరికి అనసూయ, పిల్లలు కిటికీ పక్కనే ఉన్న చెట్లలో గాజుల కోసం వెతుకుతున్నారు. నాలుగు గాజుల్లో ఒక్కటయినా దొరికినట్టులేదు.

అవి పోయాయి. వాటి గురించి మరింక ఆలోచించదల్చుకోలేదు. ఇంట్లోకి నడిచి మంచం మీద పడుకున్నాను.

అయిదు నిమషాలు గడిచాక అనసూయ గదిలోకి వచ్చి మంచం మీద నా పక్కనే కూర్చుని, నా వీపు నిమురుతోంటే, "గాజులు దొరికాయా?" అడిగాను.

"నువ్వు వెళ్ళిన దగ్గర నుండి వెతుకుతూనే ఉన్నాం దొరకలేదు." అంది.

పక్కకు తిరగి, "ఎవరయినా తీసుకెళ్ళి ఉంటారు." అని లేచి కూర్చున్నాను. పిల్లలు బిక్కు బిక్కుమంటూ తలుపు దగ్గరే నిలబడి ఉన్నారు. వాళ్ల మీద అరిచి ఉండక పోతే వాటిని బయటకు విసిరేసి ఉండరు.

"పోలీసు కంప్లెయింట్ ఇద్దామా?" అడిగింది.

"ఇస్తే వాళ్లడిగే మొదటి ప్రశ్న మీకెవరి మీదయినా అనుమానం ఉందా అని"

"ఎవరి మీదుంటుంది?"

"వాళ్లేమీ చేయరు. మనం వత్తిడి చేస్తే మననించి ఒక కంప్లెయింటు తీసుకుని వాళ్ళ ఫయిల్లో భద్రంగా పెట్టుకుంటారు. అంతే. ఒక పని చేద్దాం. మన నలుగురం కలిసి మరో సారి వెతుకుదాం. దొరికాయంటే మంచిదే. మన అదృష్టం అనుకోవాలి" అన్నాను.

నలుగురం ఓపికగా ఒక్క అంగుళమయినా వదలకుండా చాలా సేపు వెతికాం. ఫలితం లేకపోయింది. దిగాలుగా ఇంట్లోకి తిరిగి వచ్చిన అరగంట తర్వాత అనుకుంటాను, మా ఇంటి వీధి తలుపు తట్టిన చప్పుడయింది. దినపత్రిక చదవడంలో మునిగి ఉన్న నాకు వెళ్ళి తలుపు తెరవడానికి బద్ధకం వేసి, "అనూ, ఎవరో వచ్చినట్టున్నారు. చూడు" అన్నాను.

"సరే" అంది కానీ పిల్లలను ఏదో తినిపిస్తున్న అనసూయ వెళ్ళి తలుపు తెరిచే సరికి అయిదారు నిమిషాలు పట్టి ఉంటుంది. పడక కుర్చీలో కూర్చుని ఉన్న నాకు వీధి తలుపు కనిపిస్తోంది. తలుపుకు ఎదురుగా ఎవరూ లేరు. గడప మీద చిన్న అట్టపెట్టె, దాని మీద రెండు ఎర్ర గులాబిలు ఉన్నాయి.

అనసూయ అట్ట పెట్టె తెరిచి సంతోషంతో దాదాపు అరుస్తున్నట్టుగా, "గాజులు... గాజులు దొరికాయండో.... పిల్లలూ, గాజులు దొరికాయర్రా... ఎవరో

అక్కడ పెట్టి వెళ్ళిపోయారు. అని పెట్టె నాకు అందించి ఎవరు పెట్టి వెళ్ళిపోయారో తెలుసుకునేందుకు ఇంటి బయటకు వెళ్లింది.

ఎర్ర గులాబీలు చూస్తూనే ఆ గాజులు ఎవరు తెచ్చి పెట్టి ఉంటారో అర్థం అయింది. అనసూయకు ప్రమీల దొరకదు. ఈ పాటికి ప్రమీల చాలా దూరం వెళ్ళిపోయి ఉంటుంది. ఎంచాతనో ప్రమీలకు అనసూయ అంటే ఇష్టం లేదు.

ప్రమీల విషయంలో కూడా నేను తప్పుచేశాను. ఉదయం తొమ్మిదింటికి ప్రమీల ఇంటికి వెళ్ళి జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేయాల్సి ఉంది. ఉదయం నిద్ర లేచినప్పుడు వాళ్ళింటికి వెళ్ళాలని అనుకున్నాను కూడా. కేక్ నేనే కొనివ్వాలని పట్టు బడితే నిన్నే కొనిచ్చాను. ఈ వేళ నేను కేక్ కట్ చేయించాలి. ఉదయం గొడవలో ప్రమీల సంగతి మర్చిపోయాను. నాకోసం ఎదురు చూసి, ఎంతసేపటికీ రాకపోయేసరికి మా ఇంటి తలుపు వచ్చిన సమయంలోనే మా పిల్లలు గాజులు బయటకు విసిరేసి ఉండాలి. తీసుకుని భద్రంగా పూలతో తిరిగి ఇచ్చింది.

ప్రమీల ఈ మధ్యనే బదిలీ అయి వచ్చిన సహోద్యోగి కూతురు. పన్నెండు సంవత్సరాలుంటాయి. మాటలు రావు, వినబడవు. బధిరులతో మాట్లాడడం నాకు తెలుసు. నేర్చుకున్నాను. వాళ్లింట్లో తల్లి దండ్రుల మాట వినదు. నా మాటలను గౌరవం ఇస్తుంటుంది.

ప్రమీల వాళ్ళింటికి బయల్దేర బోతోంటే అనసూయ ఎదురయి, "ఎవరూ కనబడలేదు" అంది. గుండెలోంచి దుఃఖం పెల్లుబుకుతోంటే ఏం మాట్లాడ లేకపోయాను. రోడ్డు మీది కొచ్చి ప్రమీల వాళ్ళ ఇంటివయిపు నడుస్తున్నప్పుడు అమ్మ గుర్తు వచ్చింది. నన్నింత వాడిని చేసిన నా తల్లి మూగది. నాకు ఆసరా అందేవరకు ఉండలేదు.

* విపుల, మాసపత్రిక, ఏప్రిల్ 2010